# రాగలరోజు

"ఎన్నో సంవత్సరాలయినాక కలుసుకున్నాం. చాలా మాట్లాడాలని వుంది. వర్షం వెలిశాక వెళ్ళిపోతాను. అంతవరకూ-పోనీ ప్రశ్నలు వెయ్యండి" "ఇతరుల గాధలు వినాలని నాకేం ఆసక్తి లేదుగా ?" ఆమె ముఖం వెల వెల పోయింది.

అతను ఆ సంఘటన అనేకసార్లు అనేక రకరకాలుగా వూహించుకున్నాడు. అతను తీవ్రంగా ఆశించింది సంభవించింది.

కోరికలే మనిషికి ఒకింత సుఖాన్ని ప్రసాదిస్తాయి.ఒకరిని బ్రతికేటట్లు చేస్తూ, అడుగడుక్కీ ముందుకు నెట్టెపీ అవే. తీరని కోరికలు తీరవని తెలిసికూడా ఊహించుకోవటంలో ఒక అనిర్వచనీయమైన సుఖానుభూతి వున్నది.

ఒకరకం మనుషులని అదృష్టవంతులని పిలవవచ్చునో లేదో గాని, వాళ్ళునిశితంగా చేసుకున్న ఆలోచనలు ఏదో ఒకరూపేణా జరుగుతూ వుంటాయి ఎప్పుడో ఒకప్పుడు. దీనినే అధ్యాత్మిక శక్తి అంటున్నారు కొంతమంది విజ్ఞానవేత్తలు.

.... .... ....

హోరున వాన కురుస్తోంది. మధ్యాహ్నం చల్లారింది. ఎంత మదురమైన మధ్యాహ్నం! భోజనం లేకపోయినా అటువైపు ధ్యాసే లేదు. సిగరెట్లు వుండనే వున్నవాయె....కాంపౌండర్ తడుస్తూ, ఎట్లాగో అవస్థపడుతూ ఇంటికి వెళ్ళిపోయాడు. నర్స్ పాపం ఏమిచేయటానికీ తోచక, ఆపూట భోజనానికి తిలాంజలి వదిలి డిస్పెన్సరీలోనే వుండిపోయింది. అదృష్టవశాత్తూ పాలు వున్నాయి. నేను లోపల నా కోసం ప్రత్యేకంగా వుంచుకున్న గదిలో స్టవ్ మీద కాఫీ కాచే ప్రయత్నం చేస్తూండేసరికి, నర్స్ బయటనుంచి తొంగిచూసి, "ఆడదాన్ని నే నున్నానుగా డాక్టర్, మీ కెందుకీ తిప్పలు?" అంటూ లోపలకు వచ్చింది. "నేను కాఫీ చాలా బాగా కాస్తాను యశోదా!" అన్నాను. "నా కన్నానా" అని చిన్నగా నవ్వింది. ఇహ చేసేదిలేక ఆపని ఆమెకు అప్పగించి ఇవతలకు వచ్చి, కిటికీ చెంత నిల్చుని; అద్దాలగుండా జోరున కురుస్తున్న వర్షాన్ని తిలకిస్తూ సిగరెట్టు వెలిగించాను.

వీధంతా నిర్మానుష్యంగా వుంది. బళ్ళూ, రిక్షాలూ ఏమీ లేవు. నేలమీద నీళ్ళు కొత్తగా పుట్టుకొచ్చిన నదిలా పల్లాల్లోకి పాయలుగా చీలుతున్నాయి. చలివేస్తోంది. సంతోషంగా వుంది. అనాది నుంచీ మనిషికీ, నిగ్రహశక్తికీ నిరంతరం పోరాటం జరుగుతూనే వుంది. ఆశయాలతో అలమటించేవాడు కఠిన నియమంలోని కష్టంలోని, సుఖంలోని తృప్తిని తనివితీరా అనుభవిస్తూ విశాల దృక్పథాన్ని అలవర్చుకుంటూనేవున్నాడు. నియమాలు అందరికీ అర్థంకాక పోవచ్చు. అసలు అర్థం లేకపోవచ్చు. కాని అందులో ఆనందం వుంది. అది కొందరికి లభ్యమౌతుంది.

"డాక్టర్! కాఫీ" అంది నర్స్ వెనకనుంచి.

వెనక్కి తిరిగి 'థాంక్స్' అని అందుకుంటూ "యశోదా, నీకో" అన్నాను.

"ఉంది లెండి"

నాముందు త్రాగటానికి సిగ్గుపడుతూందని గ్రహించి, "పాపం, పాడువర్షం మూలాన నీవు యీ పూట వుపవాసం చేయాల్సి వచ్చింది కదా" అన్నాను సానుభూతితో.

నర్స నవ్వి, "పోనీలెండి. ఈ పూట యింటికిపోయి వండుకోవల్సిన అవస్థ తప్పింది" అంది.

"అలా అంటావుగాని నీ కాకలిగా లేదేమిటి ?"

"మీరు నిండుకుండలాగా తొణకకుండా వుండగా లేనిది, నాకు మాత్రం ఏం తీపరం ! అయినా డాక్టర్! ఇంతవరకూ ఎప్పుడూ మీతో అననిమాట ఒకటి యిప్పుడు అనటానికి సాహసిస్తున్నాను. పెళ్ళి చేసుకునివుంటే యీ రకం అనుభవాలు వుండేవి కాదుగా"

ఆమె సన్నగా నవ్వి, నా కళ్ళలోకి చూసింది.

"పెళ్ళా ? నాకు ముప్పయి ఏళ్ళు దాటాయి. ఇప్పుడు పిల్లనెవరిస్తారు యశోదా!"

"అబ్బా! అతిశయోక్తులు చెప్పకండి. మీ కెందుకనో యిష్టం లేదు. ఊరుకున్నారు"

"తెలియ కడుగుతాను, మనిషికి పెళ్ళి చేసుకోవటం అంత అవసరమా ఏమిటి ?"

"అవసరమో కాదో నాకు తెలియదు. కాని ప్రతి మనిషికీ పెళ్లి

చేసుకోకుండా వుండటానికి ఏదో కారణం వుంటుందని మాత్రం తెలుసు"

'ఊహుం. అయితే నువ్వెందుకు పెళ్లి చేసుకోలేదు?' అని ప్రశ్నిద్దా మనుకున్నాను. కాని సిగ్గుగాని, బాధగాని కలిగించిన వాడ్నవుతానేమోనని వూరుకున్నాను. బాధ పడటంలోని బాధ నాకన్న ఎవరికి తెలుసు ?

ఒక్కసారిగా గుండెలో ఏదో కీచుమని అరిచింది. తల త్రిప్పు కుని మౌనంగా వీధిలోకి చూస్తూ, కాఫీ త్రాగసాగాను. "నువ్వూ తాగు" అన్నాను కొంచం ఆగి.

ఇప్పుడేదయినా సంఘటన జరగాలని వుంది. చక్కటి సన్ని వేశం ఒకటి విరుచుకు పడాలని వుంది.

సరిగ్గా ఆ సమయానికి జట్కాబండీ ఒక్కటి ఉత్తర దిశగా పెద్ద చప్పుడు చేసుకుంటూ అతివేగంగా వస్తోంది. ఈ బ్రహ్మాండమైన వర్షంలో ఎవరికి ఎక్కడ ఏమిపని తగిలిందో తెలియదు. కుతూహలంగా చూస్తున్నాను. బండి యింటిముందు నుంచి పోతోంది. ఇంతలో ఒక భయానకమైన సంఘటన జరి గింది. అది నీళ్ళలో గుర్రం కాలుజారి బండీ బోల్తాపడటం కాదు. బండీలోంచి ఒక కోమల కంఠం విపరీతమైన భయంతో "నాన్నా" అని అరిచింది. వెంటనే అదే కంఠం "ఏయ్! ఆపు. బండీ ఆపు" అంది.

బండి కొన్ని గజాలు ముందుకుసాగి, అతి ప్రయత్నంతో ఆగి పోయింది. బండివాడు క్రిందికి దుమికి, ఆత్రుతగా ఏమిటేమిటని అరుస్తున్నాడు. నేను అద్దానికి ముఖం ఆనించి అత్యాతురతతో

చూడసాగాను. బండిలో ఎవరో స్త్రీ పిల్లాడిని గుండెకు హత్తుకుని ఏడవటం మసక మసగ్గా గోచరించింది. బండివాడు ఏమీ చేయటానికీ తోచనివాడల్లే తత్తరపాటుతో దిక్కులు చూస్తున్నాడు. నిర్జనమైన వీధి.

నే నింక ఒక్కక్షణమైనా ఆలశ్యం చేయకుండా "యశోదా, రా" అని పిలిచి, తలుపులు తీసుకుని బయటకు పరిగెత్తాను. జట్కాను సమీపించి "ఏమయింది ?" అని అడుగుతూ లోపలకు చూశాను.

వర్షం ఆగిపోయింది.

గాలి స్తంభించింది.

జట్కా బండి తిరగబడింది.

అలా ఆ అవస్థ ఒకే ఒక్క క్షణం. మరుక్షణంలో తేరుకుని "చప్పున యిలా యివ్వండి" అని ఆమె దిగ్భ్రమ చెందటం లెక్కచేయకుండా గుండెల మీదనుంచి పాపాయిని లాక్కుని గబగబా లోపలకు వచ్చాను. పిల్లాడు చచ్చిపోతున్నాడు.కట్టెలాగా బిర్ర బిగిసిపోయాడు. బల్లమీద పడుకోబెట్టి యింజక్షన్ సిరంజి కోసం చూడబోయేలోపల యశోద వెంటనే దానిని అందించింది. "పిల్లవాడు జాగ్రత్త" అని సిరంజిలోకి మందు తీసుకుంటూ తల ఎత్తి చూశాను. అదే సమయానికి గుమ్మంలో ముఖం కప్పుకుని నిలబడివున్న ఆమె చేతులు తొలగించి నా వంక విషాదంగా చూసింది. నేను చూపు మరల్చుకుని యింజక్షన్‌తో మళ్ళీ పిల్లాడి దగ్గరకు వచ్చాను.

మూడునిమిషాలు నరకయాతన పడ్డాను. పసివాడు దక్కడేమో నన్న భావం పాతాళంలోకి విసిరేస్తోంది నన్ను. కాని నాకు తెలుసు, నేను చాలా గంభీరంగా వున్నాను.

వెనకనుంచి ఏడుపు నొక్కుకుంటూన్న శబ్దం వినగలిగాను.

పసికూన కెవ్వున ఏడిచాడు. తెలివి వచ్చింది.నుదుటిమీద స్వేద బిందువులు తుడుచుకున్నాను. "డాక్టర్ !" అంది యశోద ఆద రంగా.

"ఆమెను లోపలకు పిలు" అన్నాను. తల వూపి రెండడుగులు వేసి, 'డాక్టర్' అని అరిచింది అమితభయంగా. ఏమిటా అని చూసేసరికి. గుమ్మందగ్గర నిలబడివున్న ఆమె నేలమీద పడి పోయి వుంది. "నువ్వు అబ్బాయిని చూసు" అని చెప్పి, నేను వెళ్లి ఆమెను మృదువుగా స్పర్శించి, "సీతా" అని పిలిచాను. నా పిలుపు నాకే మధురంగా వుంది.

ఆమె స్మృతి తప్పిపోయివుంది. మెల్లగా లేవదీసి, ప్రక్కగది లోకి తీసుకుపోయి బల్లమీద పడుకోబెట్టాను. నర్సుని పిలిచాను. వచ్చింది. పిల్లాడు గొల్లుమని ఏడుస్తున్నాడు. "భయంతో తెలివి తప్పిపోయింది. ముఖంమీద కొంచం నీళ్ళు జల్లితే చాలు" అన్నాను. "మరి అబ్బాయిని మీరు ఎత్తుకుంటారా ?" అని అందివ్వబోయింది. నేను సంకోచంతో చేతులు వెనక్కి లాక్కుని, వెళ్లి నీళ్ళు తీసుకు వచ్చాను.

"అబ్బా!" అంటూ ఆమె కళ్లు తెరిచింది.

నా చెయ్యి బల్లమీదే వుంది ఇంకా. ఇవతలకు వద్దామని ప్రయ

త్నించాను. కాని ఆమె నా చేతిని మృదువుగా పట్టుకుని, "మీ ఋణం తీర్చుకోలేను" అంది.

నేనేం మాట్లాడలేదు. నెమ్మదిగా చేయి విడిపించుకుని ఇవతలి గదిలోకి వచ్చి కూర్చున్నాను. బండివాడ్ని వుండమని చెప్పాను. నర్స్ వచ్చి "డాక్టర్! మీ బట్టలు బాగా తడిశాయి. మార్చుకుంటారా?" అంది. "ఫరవాలేదులే" అని సిగరెట్ వెలిగించి, ఊరికనే ఆమె ముఖంలోకి చూస్తూ ఆలోచిస్తున్నాను. ఇంతలో పిల్లాడిని ఎత్తుకుని, పిల్లాడి తల్లి లోపలనుంచి వచ్చింది.

"కూర్చోండి" అంది నర్స్.

ఆమె నా కెదురుగా కూర్చుని, నా వంక పరికిస్తోంది. ఇంకా బలహీనంగానే కనబడుతోంది.

"నర్స్! వారికి కొంచం గ్లూకోజ్ వాటర్" అన్నాను.

ఆమె తల ఊపి తిసుకు రావటానికి లోపలకు పోయింది. ఒక క్షణం ఒకరిముఖం ఒకరు మౌనంగా చూసుకున్నాము. ఆమె కూడా బాగా తడిసింది. మునుపు ఎంత అందంగా వుందో ఇప్పుడూ అంతే అందంగా వుంది. ఏ సుందరనయనాలని చూసి ఒకనాడు నేను సమ్మోహితుడ నైపోయానో అవి అలాగే తేజోవంతంగా, మనోహరంగా, ముగ్ధంగా ప్రకాశిస్తున్నాయి. కాని అవి ఇప్పుడు నన్ను పిచ్చివాడిని చేయలేవు.

"ఖులాసాగా వున్నారా?" అంది మందహాసంచేసి.

తల ఊపాను.

"ఈనాడు నేను పొందిన సహాయం ఎన్నడూ మరచిపోలేను. ఈ ఊళ్లో మా బంధువు లున్నారు. చూట్టానికి వచ్చాను. ఆరు

నూరయినా, నూరు ఆరయినా మూడుగంటల బండికే వెళ్ళిపోవాలని పట్టుబట్టాను. తప్పకుండా ఇవాళే వస్తానని వారికి చెప్పానాయె. దురుసుతనంగా బయల్దేరినందుకు మంచి శాస్తి జరిగింది. చంటిబిడ్డగుణం ఇంత భయంకరంగా వుంటుందని తెలియదండీ. బాబు ఒక్కసారి కట్టెలా బిగుసుకుపోయాడు. నేను భయంతో దద్దరిల్లి గావుకేక పెట్టాను."

పిల్లాడిని ఆనందంగా హృదయానికి హత్తుకుంది. కథనంలో ఏమీ కొత్త లేదు. బహుశా ఆడవాళ్ళంతా ఇలాగేమాట్లాడుతారు ఇలాంటి పరిస్థితి తారసిల్లినపుడు.

"అంతా కలలా వుంది. ఇంద్రజాలంలా వుంది.... మిమ్మల్ని చాలా శ్రమపెట్టాను."

మందహాసంచేసి ఊరుకున్నాను.

"నా కెంతో భయంవేసింది, కళ్లు తిరిగి క్రిందపడిపోయాను, ఆ బల్లమీదికి ఎలా వచ్చాను?"

ఆమె ఎటువంటి జవాబు వాంఛిస్తోందో తెలియకపోలేదు.

"చెప్పరా?"

"నేనే ఎత్తుకువచ్చాను" అని చెప్పేదా?

ఆమె ముఖంమీద లజ్జారుణిమ పొంగింది. ఎందుకో నవ్వింది. నర్స్ వచ్చి గ్లూకోజ్ నీళ్ళు యిచ్చి, అక్కడ నిలబడకుండా లోపలకు వెళ్ళిపోయింది. "తీసుకోండి" అన్నాను.

పిల్లాడు తల్లి వడిలో నిద్రపోతున్నాడు. ఆమె త్రాగుతున్నంతసేపూ అన్యమనస్కంగా వున్నాను.

ఆమె వంగి. గ్లాసు క్రింద పెట్టేసి "మీరు ఎక్కడో డాక్టరుగానే వుండివుంటారనుకున్నాను" అంది.

నవ్వి ఊరుకున్నాను.

"నేను కొంచం లావయ్యాననుకుంటా ?"

ఆమె నన్ను ఎక్కడకు లాక్కుపోదామనుకుంటూందో తెలియదు. కాని నాకెంతో తృప్తిగా వుంది. ఈ అదృష్టంకోసం ఎన్నాళ్లగా ఎదురు చూశానో ఎవరికేం తెలుసు ?

"మాట్లాడరేం ?"

"ఏం మాట్లాడేది ?"

"కబుర్లు చెప్పండి."

"ఎలాటి కబుర్లు ?"

"ఎన్నో సంవత్సరాలయినాక కలుసుకున్నాం. చాలా మాట్లాడాలని వుంది. వర్షం వెలిశాక వెళ్ళిపోతాను. అంతవరకూ.... పోనీ ప్రశ్నలు వేయండి"

"ఇతరుల గాథలు వినాలని నాకేం ఆసక్తిలేదుగా ?"

ఆమె ముఖం వెలవెల పోయింది.

"జీవితం ఎంత చిత్రమైంది !" అంది తేరుకున్నాక.

"చిత్రంగా వుండటం జీవితానికి సహజమేలే !"

సీత మునిపంటితో క్రింది పెదవి నొక్కుతూ, విప్పారిన నేత్రాలతో నావంక ఆశ్చర్యంగా చూస్తోంది. "పెళ్ళిచేసుకున్నారా !" అంది నవ్వి.

"చేసుకున్నాను" అన్నాను.

"ఎక్కడ వున్నారు ఆమె ?"

"వాళ్ళ ఊరు వెళ్ళింది."

"పిల్లలా అని అడగవచ్చా ?"

"ఆక్షేపణేముంది ? ఇద్దరు."

సీత నల్లగా వుంటుంది. నలుపులో అంత అందమైన మనిషిని నే నెక్కడా చూడలేదు. ఆమె మాట్లాడకుండా వూరుకునేసరికి నేను లేచి కిటికీ దగ్గరకు వెళ్ళి మరో సిగరెట్ అంటించాను. వర్షం యింకా తగ్గుముఖం పట్టలేదు. వీధిలో బండి, గుర్రం చప్పగా తడిసిపోతున్నాయి. ఇవతల వరండాలో నిలబడి చూస్తూన్న బండివాడు దిగులుగా కనిపించాడు.

"మీకు సిగరెట్లు యిదివరకు అలవాటు లేదనుకుంటా." ఎంతో మృదువుగా అంది. నేను వెనక్కి తిరిగి, "వెనకలేని అలవాట్లు యిప్పుడు చాలా వున్నాయి" అన్నాను.

ఏమనుకుందో తెలీదు. కొంచం ఆగి "మీరు ఫారిన్ వెళ్ళారని ఒకసారి...." ఎవరో నోరు నొక్కినట్లు ఆగిపోయింది.

"వెళ్ళాను. ఎమ్. బి. బి. ఎస్ అయినాక యింగ్లాండు పోయి రెండేళ్ళువుండి వచ్చాను."

ఆమె ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసింది. "అయితే డాక్టరుగారికి ఫీజు ఎక్కువగానే చెల్లించుకోవాలన్నమాట" అంది.

ఎవరో చక్కిలిగింతలు పెట్టారు. అయినా తమాయించుకుని. "అంత కష్టం వుండదు" అన్నాను.

"ఏదో బీదవాళ్ళం. మీలా గొప్పవాళ్ళం కాదు."

అబ్బ !

ఆగిపోవాలి కన్నీళ్ళు అక్కడనే. అంతరించాలి గతం అక్కడనే. అణగిపోవాలి ఆశ అక్కడనే....

బాధలు, గాథలు నిశ్చితంగా నిద్దురపోవాలి.

లోయలు, లోతులు ఆనందబాష్పాలతో నిండి, నిండుగా ప్రవహించాలి.

ఒక్క నిముషం ఉద్విగ్నచిత్తంతో అప్రతిభుడనై నిలచి పోయాను. కాని అది ఒక్క నిముషమే కదా!

ఈ వర్షం, యీ సమయం ఎంతో మనోజ్ఞంగా వున్నాయి! ఈ సన్నివేశం దయతో నాకోసం సృష్టించబడింది.

అప్పుడు నేను నవ్వాను. నా నవ్వును నేను చూసుకోలేదు. కాని సీత ముఖంలోని భావవల్లరిని చూసి నేను ఎంత అమోఘంగా, భావయుక్తంగా, శ్రావ్యంగా నవ్వానో ఊహించుకోగలను. ప్రయత్నం లేదు. స్వార్థచింత లేదు. కాని అబ్బ! ఈ నవ్వును ఎంతకాలంనుంచీ పెదాలచాటున దాచుకుంటూ వచ్చాను!!

ఒక్క నిటూర్పు! ఇపుడు నాకు ఎంత హాయి. ఎంత శాంతి!!

తరువాత జరిగిన సంభాషణలో చెప్పుకునేందుకు ముఖ్యమైన అంశమేమీ లేదు. నా గాంభీర్యం నేను కాపాడుకున్నాను. అడక్కుండానే ఆమె జీవితం ఆమె చెప్పుకుంది. అసలు ఆడ వాళ్ళచేత ఎక్కువ మాట్లాడించాలంటే, మగవాళ్లు మౌనంగా వుండటమే ఉపాయం. సాయంత్రానికి వర్షం పూర్తిగా వెలిసి పోయింది, బండివాడు తొందర చేయసాగాడు. ఏడు గంటలకు మరోబండి వుంది. సీత పిల్లాడిని ఎత్తుకుని, లేచి నిలబడి, నాకు అభిముఖంగా వచ్చి ఏదో చెబుదామని ప్రయత్నిస్తోంది.

"ఫీజు ఎంత కట్టాలో చెప్పండి" అంది చివరకు.

"కట్టేశారుగా ఎప్పుడో!"

ఆమెకు ఈమాట అర్ధంకాలేదు. అర్ధమయేటట్లు చెప్పవలసిన ఆవశ్యకత నాకు లేదు.

"క్షమించండి, బలవంతం చేస్తున్నందుకు. మీరు యీనాడు నాకు చేసిన ఉపకారానికి బదులు డబ్బుకాదని నాకు తెలుసు. కాలం దోచుకున్న వస్తువులలో అది ఒకటి. వీడు యావజ్జీవం మీకు కృతజ్ఞుడై వుండాలి."

ఆమె ధైర్యంచేసి యీ మాటలు చెప్పేసింది. నేను దీనికి కూడా సమాధానం మందహాసంతో ఇచ్చాను.

"సెలవు" అంది మెట్లు దిగి. ఆమె జట్కాలో ఎక్కి వెళ్లి పోయాక లోపలకు వచ్చి కన్సల్టింగ్ రూమ్‌లో కూచున్నాను. యశోద తలుపు తీసుకుని ఎదురుగా వచ్చి నిలబడింది,

"పాపం, వెళ్ళిపో యశోదా! పేషెంట్సు సంగతి మేము చూసుకుంటాములే."

"సరేగాని, ఒక్కసంగతి చెప్పండి."

"నాకు తెలుసులే యశోదా నువ్వడిగేది."

"మీ రెందుకు పెళ్ళిచేసుకోలేదో కారణం నేను చెప్పనా?" అంది.

"వద్దులే యశోదా ఆ సంగతులు?"

"మీకు ఇష్టంలేకపోతే చెప్పనులెండి....ఆమె చాలా అందగత్తె."

"తప్పు, పరాయి స్త్రీని గురించి ఇలా మాట్లాడకూడదు."

"మీకు పరాయిది కాదుగా."

తీరా అనేశాక, తన తొందరపాటుకు నొచ్చుకుంటూ, నాలిక కొరుక్కోసాగింది. అప్పుడు నేను, ఎదురుగావున్న కుర్చీకి

చేతులు ఆనించి నిలబడివున్న ఆమెను "కూర్చో యశోదా!" అన్నాను.

ముందు కొంచం సంకోచించి వద్దన్నా తప్పనిసరై వచ్చి కుదురుగా కూర్చుంది.

"ఎందుకో నీ ముందు నా అంతరంగిక విషయాలు చెప్పుకోవా లన్న కుతూహలాన్ని అణచుకోలేక పోతున్నాను. విని కొంటె తనం మాత్రం చేయకూడదు సుమీ."

జీవితంయొక్క విలువ తెలుసుకోవాలంటే హఠాత్తుగా ఎక్కడ్ఢినుంచో ప్రేరేపణ జరగాలి. ఆ ఎక్కడనుంచో అన్నది పరాజయం ద్వారా అయినప్పుడు ఫలితం మరింత గాఢంగా వుంటుంది.

"కాలేజీలో చదువుకుంటున్న రోజుల్లో ఒకసారి నేను ఫిజిక్స్ ప్రాక్టికల్ చేసి బయటకు వస్తూండగా ముందుగుండా పోతూన్న ఈమె ఆగి, వెనక్కి మనోహరంగా చూసింది. నేను ముగ్ధుడినై పోయాను. ఒక్క మందహాసం చేసింది. నేను ఉలిక్కిపడ్డాను. "కాని నాకెంత భయం? వివరాలన్నీ నీకు విసుగు కలిగిస్తాయి. నే నెందుకు తనచుట్టూ ప్రాకులాడుతున్నానో, ఎందుకు నిరంతరం చలించిపోతున్నానో ఆమెకు తెలుసు. కాని ఎప్పుడూ తెలిసినట్లు ప్రవర్తించేదీకాదు. నవ్వకు! ఆమె నాకంటే ఒక క్లాసు ఎక్కువ చదువుతూ వుండేది. ప్రక్కన నిలబడితేనే నాకు భయంగా, సిగ్గుగా, చిన్నతనంగా వుండేది. అంత అవ్యక్త మనోవేదన ఎవరూ అనుభవించకూడదు.

"ప్రేమ అంటారే దాన్ని గురించి నే నెక్కువగా చెప్పలేను గాని, పడిన అవస్థకన్న అది ఎక్కువ విషాదంగా వుండదు.

అజ్ఞాతంగా మనిషి విషాదాన్నే వాంఛిస్తున్నాడు. అందుకే ప్రేమ అంటే అంత మమకారం.

"ఏముంది తర్వాత? ఆమె హాయిగా ఊరువిడిచి వెళ్ళిపోయింది. నేను తెల్లబోయి మిగిలిపోయాను. నాకు జీవితమే అర్థంకాలేదు.

"అవును. ఆమె విజయాట్టహాసంచేసి అక్కడినుంచి నిష్క్రమించింది. నేను అవమానభారంతో కుంచించుకుపోయాను.

"చెప్పానుగా పరాజయం చేసే ఉపకారాన్ని గురించి. నాలోంచి ఏదో శక్తి పెల్లుబుకుకుని వచ్చినట్లయింది. తపించాను, పరితపించాను. నే నేదో సాధించాలి - సాధించివేయాలి. నన్ను చూసి ఏమీ అనుకోనివాళ్ళు నన్నుచూసి. తెల్లబోవాలి. నేను ఒక ఉన్నతస్థానంలో వుండాలి.

"ఇప్పుడు నా గురించి నీకు తెలుసు.

"యశోదా! ప్రతి మానవునిలోనూ కొన్ని విచిత్రమైన కోరికలు అనుక్షణం నాలికలు జాపుతూవుంటాయి. అవి కవ్విస్తాయి. ముందుకు నడిపిస్తాయి. ఒక్కోసారి నిజమై వూరుకుంటాయి.

"నమ్ము నమ్మకపో. రాగల యీ రోజు గురించి ఎన్నాళ్ళ గానో ఉవ్విళ్ళూరుతూన్న మనసుతో నిరీక్షించాను. అద్భుతమైన ప్రతిఫలం. నేనేమీ ఆశించలేదు. నన్ను చూసి ఏమీ అనుకోనివాళ్ళు నన్నుచూసి తెల్లబోవాలి. చంచలుడినై కానవచ్చిన నేను ఉన్నతంగా గోచరించాలి.

"ఈ సంఘటనను అనేకసార్లు అనేక రకాలుగా, హృద్యమంగా ఊహించుకున్నాను.

"అవును. ఎందుకు జరగదు? నేనింత తీవ్రంగా ఆశించింది ఎందుకు సంభవించదు.

"ఈనాటి కథ దీని పర్యవసానం. ఈరోజు అచ్చం నేను ఊహించుకున్నట్లే జరిగింది. ఊహలో లాగానే నేను ప్రవర్తించాను. ఎక్కడా తడబాటు లేదు, తొందరపాటు లేదు. ఇప్పుడు నాకెంతో తృప్తిగా వుంది. ఇప్పుడు నాకెంతో ఆనందంగా వుంది,

"నా పాత్ర నేను ఎంతో చాతుర్యంతో నిర్వర్తించుకున్నాను కదా! కళ్ళనుండి ఏదో జారినట్లు అనిపించింది. చెంపలు తడి అయినట్లుగా తోచింది.

ఇంతలో ఎవరో భక్తి శ్రద్ధలతో, సానుభూతితో వాటిని స్పృశించి, మృదువుగా నీటిని తుడిచినట్లు తెలుస్తోంది. ఒక నిమిషం ఆగి ఎవరో అక్కడినుంచి వెళ్ళిపోతున్న అలికిడి అయింది. కళ్ళు తెరచి చూసేసరికి నర్సు అక్కడలేదు. చెంపలు తడుముకున్నాను. తడిగా లేవు.

---